సింగిల్ కథలు

ఏప్రిల్ ఫూల్!

స్కూలు ఆవరణలో పిల్లలంతా భోజనాలు చేస్తున్నారు. తెల్లగా మెరిసిపోతున్న యూనిఫామ్స్‌లో వాళ్ళను చూస్తుంటే పొలాల్లో వాలిన కొంగల గుంపులు గుర్తొస్తున్నాయి.

ఓ ఇవాళ శుక్రవారం కదా అనుకుంటూ తన టిఫిన్ బాక్స్ తీసుకుని శారద దగ్గరికి నడిచింది దేవకి. రోజూ లంచ్ బెల్ వినడమే ఆలస్యం తన దగ్గరికి వచ్చేసేది బాక్స్ తీసుకుని. ఈవేళ ఎందుకనో రాలేదు. తీరా క్లాస్‌లోకి వెళ్ళిచూస్తే టేబుల్ మీద తల పెట్టుకుని కళ్ళు మూసుకుని వుంది. దగ్గరగా వెళ్ళి భుజం మీద చెయ్యి వేసేవరకూ దేవకిని గమనించనే లేదు.

"ఏమిటే బాబూ అంత ఆలోచన? పద టిఫిన్ చేద్దాం. అవతల బెల్ కొట్టేస్తారు మళ్ళీ" అంది దేవకి.

"పద" అంటూ తన వెంట వస్తున్న శారద ఎందుకో డల్‌గా ఉన్నట్లు తోచి మళ్ళీ అడిగింది దేవకి.

"ఎందుకే అదోలా ఉన్నావు? ఒంట్లో బాగుండలేదా ఏం? పోనీ ఈరోజు సి.ఎల్ పెట్టకపోయావా?"

"అబ్బే! ఒంట్లో బాగుండకపోవడం కాదు. నిన్న... నిన్న మా బావ వచ్చివెళ్ళాడు" అంది మెల్లగా.

"అదేమిటి? మీ బావ వస్తే నీవు చాలా హ్యాపీగా ఉండేదానివి కదా! అద్సరే. మళ్ళీ కొత్త పుస్తకాలు.. అదేలేవే మనం చదవనివి ఏమన్నా తెచ్చాడా లేదా?"

"తెచ్చారు. కానీ ఆ వివరాలన్నీ వివరంగా మాట్లాడుకుందాం. సాయంత్రం మా ఇంటికి రారాదూ" ఒకింత వేడికోలు వినిపించిందామె స్వరంలో.

"అలాగే తప్పకుండా వస్తాను. ఐనా మీ బావ బుక్స్ తెచ్చాడంటే నువ్వు పిలవకపోయినా వచ్చేసి పుస్తకాన్ని తీస్కెళ్ళిపోతానని నీకు మాత్రం తెలియదా?" చిన్నగా నవ్వింది దేవకి.

ఇంతలో బెల్ మ్రోగడంతో ఎవరి క్లాసుకి వాళ్ళు వెళ్ళిపోయారు.

★ ★ ★

శారద, దేవకి ఇద్దరూ మూడవ తరగతి నుండీ కలిసి చదువుకున్నారు. తర్వాత కాలేజీ చదువు ఆ తర్వాత బీఎడ్ అన్నీ కలిసే చదవడంతో ఇద్దరి మధ్య స్నేహం బలపడింది. గవర్నమెంట్ జాబ్ వచ్చేవరకూ ఊరికే ఉండడం ఎందుకని ఇద్దరూ ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్లుగా పనిచేస్తున్నారు. వాళ్ళ ఇద్దరి అలవాట్లు, అభిరుచులు ఒకటే. ఇద్దరి మధ్య రహస్యాలంటూ లేవు. ఇద్దరికీ కథల పుస్తకాలు, నవలలు చదవడం చాలా ఇష్టం. చందమామ నుంచీ వార, మాసపత్రికలు, నవలలు అన్నీ చదువుతారు. దొరికినవి దొరికినట్లు చదివేస్తారు. అప్పుడప్పుడు చదివిన వాటి గురించి చర్చించుకుంటారు కూడా.

వీళ్ళ విషయం తెలిసిన వాడవడం చేత శారద బావ

చక్రధర్ వచ్చినప్పుడల్లా ఏవో పుస్తకాలు తెస్తుంటాడు. 'ఈసారి ఏమేం పుస్తకాలు తెచ్చాడో. త్వరగా వెళ్ళిచూడాలి' అనుకుంది దేవకి.

ఇంటికి వెళ్ళి కాళ్లు చేతులు ముఖం కడుక్కుని బయలుదేరి శారదవాళ్ళ ఇంటికి వెళ్లింది. తనకోసమే ఎదురుచూస్తున్నట్లు వరండాలో నిలబడి ఉన్న శారదను చూసి కొంచెం ఆశ్చర్యపోయింది. ఏమిటో తెలియదు, కానీ ఈవేళ శారద ప్రవర్తన వింతగా ఉంది అని కూడా అనుకుంది.

"రారా! ముందు కాస్త కాఫీ తాగుతావా!" అంటూ తనగదిలోకి లాక్కెళ్ళింది. టేబుల్ మీద నుంచి ఫ్లాస్కు తీసి రెండు కప్పుల్లో కాఫీ వంచి తానొకటి తీసుకుని రెండోది దేవకికి ఇచ్చింది.

"ఊఁ! ఇప్పుడు చెప్పు" అంది దేవకి ఖాళీ కప్పు టేబుల్ మీద పెడ్తూ.

"బావ వచ్చాడని చెప్పాను కదా! ఇదిగో ఈ మూడు పుస్తకాలు తెచ్చాడు. ఇంకా కొన్ని మానపత్రికలు, కామిక్ బుక్స్ కూడా తెచ్చాడు. ఎన్ని పుస్తకాలు తెచ్చినా ఒకవారంలో అన్ని చదివేసి తర్వాత బోర్ అంటున్నానని చెప్పి ఈసారి పుస్తకం ఎప్పుడు చదవాలి అని కవర్ల మీద డేట్ వేశాడు. ఈ మూడు పుస్తకాలకు మధ్య మధ్య మంత్లీలు, కామిక్స్ చదవమన్నాడు. ఇదిగో ఇది చెలియలికట్ట. ఇదేమో ఈ గురువారం చదవాలట. రెండోది పై గురువారం మూడోది ఆపై గురువారం చదవాలట.." ఊపిరి పీల్చుకునేందుకన్నట్లుగా ఒక్క నిముషం ఆగింది శారద.

తర్వాత చెప్పింది. గురువారం ఇంకా వారంరోజులుంది. అంతవరకూ ఎవరాగుతార్లే అని నిన్ననే చెలియలికట్ట తీసి చదివేశాను. తర్వాత కామిక్స్, మంత్లీలు తీసి ముందేనుకుని కూర్చున్నాను. కానీ మనసు ఆ రెండు పుస్తకాల మీదనే పోతుండడంతో కవర్ లమీద వేసిన తేదీకన్నా ముందే చదివానని, తనకి తెలుస్తుందా ఏం అనుకుని రెండో పుస్తకం తీసి పేజీలు తిప్పుతుంటే..." హఠాత్తుగా శారద కంఠం జీరబోయింది.

"అరె! ఏయ్ శారదా! అదేమిటో ఏమయింది" అంది దేవకి ఆత్రుతగా.

"ఆ పుస్తకంలోంచి ఈ ఫొటో క్రింద పడింది చూడు" అంటూ ఓ ఫోటోని దేవకి చేతిలో పెట్టింది శారద.

ఆ ఫొటో ఒక అందమైన అమ్మాయిది. చాలా బాగుందా అమ్మాయి. పేరు గానీ ఇతర వివరాలేమన్నా తెలుస్తాయేమోనని వెనక్కి త్రిప్పి చూసింది. పేరు లేదు గానీ 'చక్రికి ప్రేమతో' అని ఉంది. కాస్సేపేం మాట్లాడాలో తోచనట్లుండిపోయారు ఇద్దరూ. ఎవరిదై ఉంటుంది ఆ ఫోటో. శారదకేసి చూస్తే దిగులుగా కూర్చుని ఉంది. చక్రధర్‌కి, శారదకీ ఈ మధ్యనే ఎంగేజ్‌మెంట్ జరిగింది. మరి అతనిచ్చిన పుస్తకంలో ఒక అమ్మాయి ఫోటో ఉండడం ఏమిటి? ఇదేదో ఆలోచించవలసిన విషయమే. 'అయినా చక్రధర్ చాలా మంచి మనిషి. మరి ఈ ఫోటో? దీని వెనుక ఏదో తిరకాసుంది.

అదేమిటో కనిపెట్టాలి' అనుకుంది దేవకి.

"ఏయ్ శారదా! మీ బావ సంగతి నీకు తెలియదా? అతనికి నువ్వంటే చాలా ఇష్టం. వేరే ఆలోచన్లేం పెట్టుకోకు. మీ అమ్మా నాన్నలకి కూడా ఈ విషయం ఏమీ చెప్పకు. నువ్వోసారి చక్రికి ఫోన్ చేయరాదూ" అంది దేవకి.

"ఫోన్ చేద్దామనే అనుకున్నాను. కానీ విషయం పూర్తిగా తెలుసుకోకుండా తనని అనుమానిస్తే తను హర్ట్ అవుతాడేమో అని ఆగాను"అంది శారద.

"సరే! మనం ఇద్దరం ఆలోచించి ఏం చేయాలో చూద్దాం. ఇక నే వెళ్తాను" అంటూ నాలుగు కామిక్‌బుక్స్ ఆ ఫోటో తీసుకుని ఇంటికి వచ్చింది దేవకి.

ఇంటికి వచ్చినా మనసులో అదే విషయం కదలాడుతోంది. పుస్తకాలేం చదవబుద్ధి కాక ఆ ఫోటో తీసి చూస్తూ కూర్చుంది. చూడగా చూడగా ఆ ఫోటోలోని అమ్మాయిని ఎక్కడో చూసినట్లు అనిపించసాగింది. ముఖ్యంగా ఆ కళ్ళు. బాగా పరిచయమైన వ్యక్తిలా అనిపిస్తుంటే ఎక్కడ చూసి ఉంటుందా అని ఆలోచిస్తూ పుస్తకం పైన రాసి ఉన్న రెండవ గురువారం అన్న మాటనే చూస్తూ మంచం మీద పడుకుంది. అలా రాసిన గురువారం ఏప్రిల్ ఒకటని తేలింది. ఎదురుగా గోడకి వ్రేళ్ళాడుతున్న క్యాలెండర్ చూడగానే దేవకి మనసులో తళుక్కుమందో ఆలోచన. ఫోటోని చేతుల్లోకి తీసుకుని కాసేపు చూసింది. ఏదో ఒక ఊహ తోచి ఫోటోపైన నుదురు, క్రింది ముక్కు నించి గడ్డం వరకూ పేపర్‌తో మూసి మధ్యలో కనబడుతున్న కళ్ళని పరీక్షగా చూడగానే మిస్టరీ వీడిపోయింది. ఆ ఫోటోలో ఉన్నది చక్రధర్. అమ్మాయి వేషంలో ఫోటో తీయించుకుని శారదని ఏడిపించేందుకు అలా పంపాడన్నమాట. ఒకే పుస్తకం ఇచ్చి దాన్లోనే ఫోటోపెట్టి పైన డేట్ వేస్తే అనుమానం వస్తుందని మొత్తం మూడు పుస్తకాలు తెచ్చి ఏప్రిల్ ఫస్ట్‌కి ముందు ఒకటి తర్వాత ఒకటి వచ్చేలోగా చదవమన్నాడన్నమాట. ఉదయమే శారదకీ విషయం చెప్పాలి అనుకుంది దేవకి.

మరునాడు స్కూల్‌కి వెళ్లగానే శారదని కలిసి తను కనుక్కున్న విషయం చెప్పింది. ఫోటోని పరీక్షగా చూసిన శారద కళ్ళు మతాబాల్లా వెలుగులు చిమ్మాయి. దేవకిని ఎంతో మెచ్చుకుంది శారద. "సరే సరే! మరి మీ బావకి నువ్విచ్చే రిటార్ట్ ఏమిటి?" అంది దేవకి.

"నన్ను ఫూల్‌ని చెయ్యాలనుకున్నాడు కదా! నీ విషయం కనిపెట్టేశాను. కాబట్టి నువ్వే ఫూల్‌వి అయ్యావని సరిగ్గా ఏప్రిల్ ఫస్ట్‌కి అందేలా లెటర్ రాస్తా" అంటూ గలగలా నవ్వింది శారద. ఆ నవ్వులో తనూ జతకలిపింది దేవకి.

- సాధనాల నాగవర్ధని (నూజివీడు)

తగినశాస్తి

ఎలక్షన్ కమీషనర్ శాసనసభ్యుల, పార్లమెంట్ సభ్యుల వ్యక్తిగత ఆస్తిపాస్తుల వివరాలు బహిర్గతం చేయండని హుకుం జారీచేశాడు. దాంతో కోట్లు గడించిన నాయకులు బెంబేలెత్తారు.

మల్లగుల్లాలు పడి ఆస్తులు ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లు సృష్టించారు. దినపత్రికలకు ప్రకటనలు పంపారు. వారిలో ఎమ్మెల్యే బండరాజు పంపిన ప్రకటన ఇలా ఉంది.

"ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా అయ్యా! నేను బండలకొండ నియోజకవర్గం శాసనసభ్యుడిని. పేరు బండరాజు. నేను రాజకీయల్లోకి రాకపూర్వమూ, వచ్చిన తర్వాత కూడా ఆస్తులన్నీ లెక్కగట్టినా లక్షలోపే. మా స్వగ్రామంలో ఎందుకూ కొరగాని పోరంబోకు భూమి నాలుగు గుంటలు ఉంది. పాతకాలంనాటి పెంకుటిల్లు ఉంది. ప్రస్తుతం నేను రాజధానిలోని సర్కారు వారిచ్చిన క్వార్టర్స్‌లో కాలం వెళ్లదీస్తున్నాను. మా స్వగృహంలో నాలుగు వంటపాత్రలూ, రెండు ఫ్రేమ్ కుర్చీలు అవీ పాతవే. ఓ డొక్కు ఫ్యాన్, తిరుగుతున్నా గాలి రాదు. నీళ్ళు తాగడానికి మట్టి పాత్ర అంతే ఉన్నాయి. ఇంట్లో కలర్‌టీవీ గానీ, డబుల్‌డోర్ ఫ్రిజ్ , ఏసీ మిషన్, ఇంపోర్టెడ్ కారు లేదు. ఓ డొక్కు వాహనం ఉంది. అది మనుషులు నెట్టితేనే ముందుకి కదులుతుంది"

* * *

సమయం అర్ధరాత్రి దాటి అపరాత్రి అయింది. సమస్త జీవరాశులు నిద్రావస్థలో ఉన్నాయి. అంతరాష్ట్ర తోడు దొంగలు డేవిడ్, లింకన్ ఓ ఇంటిముందు ఆగారు. ప్రహరీగోడకు ఉన్న శిలాఫలకంలో ఎమ్మెల్యే బండరాజు అన్న పేరు అంత చీకటిలో కూడా ప్రకాశిస్తోంది. వాళ్ల పెదాలపై చిరునవ్వు మందహాసం చేస్తోంది.

"మనం కొల్లగొట్టబోయే ఇల్లు ఇదే" అని నిర్ణయించుకున్నారు.

గేటు దాటి అతి చాకచక్యంగా ఇంట్లోకి ప్రవేశించారు డేవిడ్, లింకన్.

ఇంట్లో ఎవ్వరూ లేరు. చకచకా తమ పనులు చేసుకుపోయారు ఇద్దరూ. కలర్‌టీవీ, డబుల్ డోర్ ఫ్రిజ్, ఏసీ మిషన్, పట్టుచీరలూ, నగలూ, నగదూ ఉన్న బీరువాతో సహా కొల్లగొట్టి ఇంటి కాంపౌండులో ఉన్న ఇంపోర్టెడ్ కారులో పలాయనం చిత్తగించారు.

భార్యాపిల్లలతో ఎక్కడికో వెళ్ళిన బండరాజు తెల్లారి వచ్చి ఇల్లును చూసుకుని గొల్లుమన్నాడు. గుండెలు బాదుకున్నాడు. పదినిముషాల పాటు షాక్‌కి గురై తేరుకున్నాడు. 'పోలీసు రిపోర్టు ఇవ్వాలి' అనుకుని అంతలోనే మనసు మార్చుకున్నాడు.'ఇంట్లో పోయిన వస్తువుల గురించి రిపోర్ట్ ఇస్తే అసలుకే మోసం వస్తుంది. బ్లాక్‌మనీ అంతా బహిర్గతమై జైలుకి పోయినా పోవాల్సి వస్తుంది' అనుకున్నాడు. తేలుకుట్టిన దొంగలా అయిపోయాడు బండరాజు.

- ఒ.వెంకటేశ్వర్లు (కాటేపల్లి)